
ప్రజాశక్తి

శుక్రవారం 25 ఏప్రిల్ 2025 5 విజయనగరం



6న డాక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం

పోస్టల్ సేవల పై ప్రజల నుండి వినతులను స్వీకరించడానికి మే 6న డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయపు సహాయ సంచాలకులు ఒక ప్రకటన లో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులు, వినతులను కవర్ పై డాక్ అదాలత్ అని రాసి అసిస్టెంట్ డైరెక్టర్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, విజయవాడ వారికి పోస్ట్ ద్వారా మే 1 వ తేదీ లోపల చేరేలా పంపాలని తెలిపారు. ప్రజలు మే 6 వ తేదీన ఉదయం 11 గంటలకు నేరుగా కూడా విజయవాడ సర్కిల్ కార్యాలయం వద్ద హాజరు కావచ్చునని లేదా http://meet.google.com/sck-axas-bmg లింక్ ద్వారా హాజరై వారి ఫిర్యాదులను వివరించవచ్చునని తెలిపారు.



టెక్నికల్ అసిస్టెంట్లపై రికవరీ జులుం

ఉపాధి హామీలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లపై క్వాలిటీ పేరుతో ఆ విభాగం అధికారులు ముమ్మరిస్తున్నారు లేనంతగా రికవరీ జులుం ప్రదర్శిస్తున్నారు. కూలీలు చేసిన పని లెక్కింపులో కాస్తంత తగ్గినా పర్యాలేదు గానీ, పెసరంత ఎక్కువ చూపించినా ఊరుకునేది లేదన్నట్లు రికవరీలు రాసేస్తుండడంతో టెక్నికల్ అసిస్టెంట్లు, స్థానిక ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ప్రభావం మెజర్‌మెంట్‌పై పడడంతో ఒకేసారి వేతనం రూ.54 తగ్గిపోయింది. గత ఆర్థిక సంవత్సరం అంతా సరాసరి రోజువారీ వేతనం రూ.226 చొప్పున అందగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.172కు పడిపోయింది. విజయనగరం జిల్లా చరిత్రలో ఇంత తక్కువ వేతనం ఏనాడూ అందలేదని జలయజ్ఞమాన్య సంస్థ (డ్వామా) రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వేతనం అంతలా పతనం కావడంతో కూలీల్లో ఆందోళన మొదలైంది. డ్వామా అధికారుల మధ్య సమన్వయలోపం, అధిపత్య ధోరణి అందుకు కారణమని తెలుస్తోంది.

- రూ.172కు పడిపోయిన ఉపాధి వేతనం
- ఊసురోమంటున్న ఉపాధి కూలీలు
- సమన్వయ లోపమే కారణం?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఉపాధి గ్యారెంటీ జాబ్ కార్డులు 3.84లక్షల వరకు ప్రభుత్వం జారీచేసింది. వీటి పరిధిలో 6.84లక్షల మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఇందులో 5.94లక్షల మంది కూలీలు 3.53లక్షల జాబ్‌కార్డుల ద్వారా ఉపాధి హామీ పనులు ఆధారంగానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇందులో సుమారు 54వేల వరకు దళిత, గిరిజన కుటుంబాలు కాగా, మిగిలినవారంతా భూమిలేని ఇతర సామాజిక వర్గాలకు చెందినవారు ఉన్నారు. ఈనేపథ్యంలో జిల్లాలో అత్యధిక కుటుంబాల వారికి ఉపాధి పనులే జీవనాధారం. ఉపాధి పనులు ఎక్కువగా ఉపయోగించుకుంటున్న జిల్లాగా విజయనగరానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక సార్లు అవార్డు లభించింది. ఇటువంటి జిల్లాలో పని దినాల కల్పనలో అధికార యంత్రాంగం వెనుకబడిపోయింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.81కోట్ల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1.70కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించారు. 2023-24లో 2.10కోట్ల పని దినాలు లక్ష్యం పెట్టుకోగా 2.18 కోట్ల పనిదినాలు, 2022-23లో 1.86 కోట్ల పనిదినాలకు గాను 1.95కోట్ల పనిదినాలు కల్పించారు. అంతకుముందు ఉమ్మడి విజయనగరం జిల్లాలోనూ లక్ష్యానికి మించి పనులు కల్పించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఉపాధి పనులకు ఇంతటి అవసరం, ఆదరణ ఉన్న మన జిల్లాలో ఈ ఏడాది 11కోట్ల పనిదినాలు తగ్గిపోవడం గమనార్హమే. ఈ సంగతి కాస్త అటుంచితే, పనికి తగ్గవేతనం కూడా రాకపోవడం కొత్త సమస్యగా పరిణమించింది. ఇదేదో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్య కాదు కేవలం మన జిల్లాలో మాత్రమే ఒకేసారి రూ.54తగ్గిపోవడంతో అతి తక్కువ వేతనం అందజేస్తున్న జిల్లాగా ఘనతకెక్కింది.

ఉపాధి వేతనం ఇంతలా తగ్గిపోవడానికి డ్వామాలో అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపమే కారణమని తెలుస్తోంది. ఉపాధి పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు సహకరిస్తున్న ఇంజినీరింగ్ కన్సల్టెంట్లే అత్యంత కీలకం. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ స్థాయిలో పనులను గుర్తించడం మొదలుకుని వాటి ఆమోదం తీసుకోవడం, కూలీలను పనిలోకి దింపడం వంటి పనులు చేస్తుంటారు. ఇక టెక్నికల్ అసిస్టెంట్లు చేసిన పనికి కొలతలు తీసి, ఎం బుక్ సబ్‌మిట్ చేస్తారు. వీరికి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కూడా సహకరిస్తుంటారు. దీన్నిబట్టి కూలిరేటు నిర్ధారణ టెక్నికల్ అసిస్టెంట్ల చేతుల్లో ఉంటుందన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. వీరిపై గడిచిన కొన్నినెలలుగా క్వాలిటీ నిర్ధారణ పేరిట అధికారుల వేధింపులు పెరిగిపోయాయి. పనిలో నాణ్యతలోపించిందన్న పేరుతో టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి లక్షలాది రూపాయలు రికవరీ రాశారు. ఎంతమంది టిఎలపై ఎంత రికవరీ రాశారన్నది డ్వామా అధికారులు ఒకింత రహస్యంగా ఉంచినప్పటికీ సుమారు వందకుపైగా టిఎలపై దాదాపు అర రూ.కోటి వరకు రికవరీలు రాసేసినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలో పని మెజర్‌మెంట్‌లో క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు చెప్పిన విధంగా కోత పెడుతున్నారు. దీంతో, జిల్లాలో కూలి రేటు అమాంతంగా రూ.172కు పడిపోయింది. వాస్తవానికి ఈ విషయం చాలా మంది వేతనదారులకు తెలియదు. ఎందుకంటే జనవరి 15వ తేదీ నుంచి వేతన బకాయి ఉంది. అంతకు ముందు మాదిరిగానే రూ.226 చొప్పున అందుతాయనే భ్రమల్లోనే ఉన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ప్రభావం కేవలం ఉపాధి కూలీలపైనే కాదు. జిల్లాలో కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. చిన్నచితక వ్యాపారాలపైనా ప్రభావం పడుతుంది.

కలెక్టర్ దృష్టి పెడితేనే పరిష్కారం

జిల్లాలో కొన్ని దశాబ్దాలుగా ఉపాధి పనులు చేయగలిగిన కూలీలు ఇప్పుడు చేయలేకపోతున్నారు? ఇన్నాళ్లూ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇలాగే పనిచేసిందా? లేక పీడీ, ఎపిడిలతో క్వాలిటీ కంట్రోల్ విభాగానికి సమన్వయం లోపించిందా? ఇంతకీ టిఎలు ఎందుకు టార్గెట్ అయ్యారు? అన్న ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానం రాబట్టాల్సివుంది. తద్వారా తగ్గిపోయిన వేతనాలు యథా స్థితికి వెళ్లే అవకాశం లేకపోలేదు.

ఉగ్రవాదుల దాడి దుర్మార్గం

నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన మారణ హోమానికి నిరసనగా కోట జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దుతో ఉగ్రవాదం పూర్తిగా రద్దు అయిపోతుందని చెప్పిన మోడీ ప్రభుత్వం ఈ దారుణ ఘటనకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. మరో వైపు ఉగ్రవాద దాడిని దేశంలో హిందూ, ముస్లిం దాడిలాగా సృష్టించడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశ ప్రజలకు ఉగ్రవాదులను రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రమణ, వి.లక్ష్మి, అర్.ఆనంద్, వి.రాజగోపాల్, ఎం.శ్రీనివాస కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో గాంధీ విగ్రహం వద్ద పలు సంఘాల నాయకులు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన యాత్రికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టివి దుర్గారావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగేటి సంతోష్, జి.వినోద్ బాబు, ప్రజాహక్కుల సాధన సమితి నాయకులు చోడి ఆదినారాయణ, దళిత చైతన్య సేవా సంఘం సోము మురళి పాల్గొన్నారు.



విజయనగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేపడుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

బొబ్బిలి : ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఉగ్రవాదం నశించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని సమితి నాయకులు విజయగౌరి, శంకరరావు, ఇంతియాజ్ అన్నారు.

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి సంఘటన అమానవీయ చర్యని రోటరీ జిల్లా అధ్యక్షులు చైర్మన్ జెసి రాజు ఖండించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షులు సింద్రీ శ్రీనివాసన్, కార్యదర్శి సిహెచ్‌జె ప్రవీణ్, సభ్యులు శ్రీహరి, కె.రామకృష్ణ, కె.నాగరాజు, కృష్ణ మోహన్, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రామభద్రపురం : పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయడం అమానుషమని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు బొద్దూరు శ్రీనివాసరావు అన్నారు. దాడికి నిరసనగా గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక బైపాస్ రోడ్డు వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం బైపాస్ రోడ్డు నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తవలస : ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి చిత్రపటాలకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వబ్బిన సత్తిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లువలస శ్రీను, గాడి అప్పారావు పాల్గొన్నారు.



బొబ్బిలిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న రాజ్యాంగ పరిరక్షణ సమితి సభ్యులు

జిందాల్ లాకౌట్ ఎత్తేయాలని ఆందోళన

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ కర్మాగారంలో అక్రమ లాకౌట్ ఎత్తివేసి బేషరతుగా ఉపాధి కల్పించాలని గేటు వద్ద కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. పరిశ్రమను అక్రమంగా మూసివేసి వారం రోజులు గడుస్తున్నా యాజమాన్యంలో ఎటువంటి మార్పు రాకపోవడం విచారకరమని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు, ఐఎన్‌టియుసి, వైఎస్‌ఆర్‌టియుసి నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


జిందాల్ పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

బాలబాలికలకు నైతిక విలువలు నేర్పాలి

ప్రాంతీయ సదస్సులో ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-విజయనగరం

కౌమారదశలో బాల బాలికలకు తల్లిదండ్రులు నైతిక విలువలు నేర్పాలని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.చిన్మయిదేవి అన్నారు. సిడిపిఒలు, డిసిపిఒలకు జోనల్‌స్థాయి వర్క్‌షాప్ గురువారం స్థానిక కెమిస్ట్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి చిన్మయి దేవి మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాల బాలికలకు మానసికంగా, ఆలోచనా పరంగా మార్పులు చోటుచేసుకుంటాయని, ప్రమాదకర పరిస్థితుల నుండి దూరం చేసి వారిని సన్మార్గంలోకి తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులను చైతన్యపర్చాలని తెలిపారు. వేసవి సెలవుల్లో అవగాన కార్యక్రమాలు నిర్వహించి కిషోర బాలబాలికలకు దిశా నిర్దేశం చేయాలన్నారు. 13 నుంచి 19ఏళ్ల కిశోర బాలబాలికలకు ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. యునిసెఫ్ కన్సల్టెంట్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాల బాలికల నడవడికపై తల్లిదండ్రులకు అభద్రతా భావం ఉండకూడదని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాల బాలికల పై డిజిటల్ మాధ్యమాలు ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. కౌమార దశలో ఉన్న బాల బాలికలు తో తల్లిదండ్రులు కూర్చుని వారితో చర్చించి వారి అవసరాలు తీర్చాలని చెప్పారు. సఖి, యువ గ్రూప్‌ల పరిధిలో కిశోర బాలల తల్లిదండ్రులకు పోక్సో చట్టం,బాల్యవివాహాలు నిరోధం, టీనేజ్ ప్రెగ్నెన్సీ నిరోధం, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం ప్రాజెక్ట్ డైరెక్టర్ రుక్సానా సుల్తానా, మన్యం ప్రాజెక్ట్ డైరెక్టర్ కనక దుర్గ, రిసోర్స్ పర్సన్ నాగమణి, మన్యం జిల్లా నోడల్ ఆఫీసర్ టి.జగన్, మూడు జిల్లాల సిడిపిఒలు, డిసిపిఒలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు ఆదివాసీ జెఎసి వినతి

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్రలో ఉన్న నకిలీ కులదవ పత్రాలు, ఇతర దీర్ఘకాల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు గురువారం విజయనగరంలో ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావును కలిసి వినతి అందజేశారు. షెడ్యూల్ ప్రాంత భూములపై హక్కులు గిరిజనులకే దక్కేలా చూడాలని జెఎసి నాయకులు నిమ్మక జయరాజు , ఆరిక నీలకంఠం, అమర్నాథ్ తదితర నాయకులు కోరారు. చైర్మన్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అభివృద్ధి సాధనలో ఆదర్శంగా నిలపాలి

- ప్రాథమిక రంగంలో అభివృద్ధికి అవకాశాలు
- పంటల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, నాణ్యత పెరగాలి : కలెక్టర్


గజపతినగరం : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-గజపతినగరం, బొబ్బిలి

జిల్లాలో తలసరి ఆదాయాన్ని 15 శాతం పెంచే విధంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ప్రణాళికలను రూపొందించమే కాకుండా, వాటిని చిత్తశుద్ధితో అమలుచేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ద్వారా ఇతర జిల్లాలకు మన జిల్లాను ఆదర్శంగా మార్చాలని కోరారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ పై నియోజకవర్గ స్థాయి అవగాహనా కార్యక్రమాలు గురువారం బొబ్బిలి, గజపతినగరంలో జరిగాయి.

జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ ముందుగా మాట్లాడుతూ, విజన్ ప్లాన్ లక్ష్యాలను వివరించారు. పది సూత్రాలను, వాటిని సాధించేందుకు అవలంబించాల్సిన మార్గాలను పవర్ పాయింట్ ద్వారా తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2047 విజన్ ప్లాన్ అమల్లో భాగంగా జిల్లా తలసరి ఆదాయాన్ని 15 శాతానికి పెంచాలని కోరారు. మన జిల్లా పరిస్థితులను బట్టి ప్రాథమిక రంగంలోనే ఎక్కువ అభివృద్ధి సాధించే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూమి సుమారు 3 లక్షల ఎకరాలు వరకు ఉందని, కానీ ప్రస్తుతం లక్షా 80 వేల ఎకరాలు మాత్రమే సాగు అవుతోందని, మిగిలిన భూమిని దశలవారీగా సాగులోకి తీసుకురావాలని సూచించారు. వివిధ రకాల పంటలు, అంతర్ పంటలను సాగు చేయాలని చెప్పారు. ఉద్యాన, వాణిజ్య పంటల సాగును విస్తరించడం, ఉత్పత్తిని, ఉత్పాదకతను, నాణ్యతను పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. అందుబాటులో ఉన్న చెరువుల్లో చేపల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. సేవా రంగం అభివృద్ధిలో కూడా జిల్లాలో విస్తత అవకాశాలు ఉన్నాయని, భోగాపురం విమానాశ్రయం ఏర్పాటైతే ఈ రంగంలో అవకాశాలు ఎక్కువవుతాయని తెలిపారు. గ్రామ స్థాయి పరిస్థితులను, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటికి తగ్గట్టుగా గ్రామ స్థాయి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు.

వ్యవసాయశాఖ జెడి వి.టి.రామారావు, పశుసంవర్థక శాఖ జెడి డాక్టర్ వైవి రమణ, ఉద్యానశాఖ డిడి ఎవిఎస్‌వి జమదగ్ని, ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ ఇంచార్జ్ డిడి విజయకృష్ణ మాట్లాడుతూ తమ శాఖా పరమైన లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ను కలెక్టర్ తిలకించి, రైతులకు నవధాన్యాల కిట్లను చేశారు. ఆదర్శ రైతులను సత్కరించారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారులు నూకరాజు, ప్రమీలాగాంధీ, ఆర్డీవో రామ్మోహనరావు, ప్రకతి వ్యవసాయం డిపిఎం ఆనందరావు, నాలుగు మండలాల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక బహిష్కరణపై చర్యలు

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పోతురాజు పేటలో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన పెత్తందారులపై కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ విగ్రహం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి పెత్తందారులు బేరం పెట్టారని తెలిపారు. దీనిని అడ్డుకొని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన దుంగ శ్రీరాములు, గడ్డెమ్మ, దాలయ్య కుటుంబాలను పనులకు, శుబకార్యాలు, ఎటువంటి కార్యక్రమాలకూ పిలవకూడదని పెత్తందార్లు గ్రామ సమావేశంలో నిర్ణయించారని తెలిపారు. తక్షణమే ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి కేసులు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారం చెయ్యని రెవెన్యూ అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో దళితులపై దుర్మార్గమైన కులదురాంకార దాడులు, హత్యలు, సాంఘిక బహిష్కరణలు జరుగుతుంటే హోంశాఖమంత్రి పట్టిపటనట్లు వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించారు. సాంఘిక బహిష్కరణకు గురైన దళిత ప్రాంతాలను సందర్శించి బాధితులకు మనోధైర్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎపిఆర్‌జెసి, ఎపిఆర్‌ఇఐ, రెసిడెన్షియల్ స్కూల్స్

ప్రవేశ పరీక్షలు నేడు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎపిఆర్‌జెసి, ఎపిఆర్‌ఇఐ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రవేశపరీక్షలు ఈ నెల 25 న నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్టుమెంటల్ అధికారులతో డిఆర్‌ఒ సమావేశం నిర్వహించి ఏర్పాట్ల పై సమీక్షించారు. ఎపిఆర్‌ఇఐ రెసిడెన్షియల్ స్కూల్స్ లో 5,6,7,8 తరగతులలో ప్రవేశం కోసం ఈ నెల 25 న ఉదయం 10 నుండి 12 గంటల వరకు జిల్లాలోని 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు 1287 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎపిఆర్‌జెసి, ఎపిఆర్‌డిసిల్లో ప్రవేశం కోసం మధ్యాహ్నం 2.30 నుండి 5 గంటల వరకు 10 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎపిఆర్‌జెసి కోసం 10 కేంద్రాల్లో 2104 మంది అభ్యర్థులు, ఎపిఆర్‌డిసి కోసం 77 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారని తెలిపారు. పరీక్షల కోసం అవసరమగు సిబ్బందిని నియమించాలని, పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిఇఒ మాణిక్యం నాయుడుకు డిఆర్‌ఒ సూచించారు. అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు కూడా మొబైల్ ఫోన్లను పరీక్షా కేంద్రల్లోకి అనుమతించకూడదని తెలిపారు. సమావేశంలో డిఇఒ మాణిక్యం నాయుడు, పరీక్షల సహాయ కమీషనర్ సన్యాసిరాజు, ఎపిఆర్‌ఐఒ జిల్లా కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పురుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్ వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సి ఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30లక్షల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా అనేక ఏళ్లగా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ గత వైసిపి ప్రభుత్వం 1214 మెమో జారీ చేసిందన్నారు. ఫలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారన్నారు. కార్మికులకు అన్ని రాష్ట్రాల్లో బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. మన రాష్ట్రంలో మాత్రం సంక్షేమ పథకాలు ఆపివేశారన్నారు. ఎన్నికలకు ముందు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. ధర్నా లో కార్మికులు పి.ప్రవీణ్ కుమార్, ఎల్.సురేష్, కె. ఎర్రిబాబు, బి.పైడిరాజు, బి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషి

డిఎంహెచ్‌ఒ జీవనరాణి


ప్రజాశక్తి-విజయనగరంకోట

మలేరియా నివారణకు కలసి కట్టుగా కృషి చేయాలని పలుశాఖల అధికారులను డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి కోరారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో మలేరియా నివారణ ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ మలేరియా ఆరోగ్యాన్ని పాడుచేయడమే కాకుండా, సభ్య సమాజంలో తీవ్ర అసమానతలకు దారితీస్తుందని అన్నారు. ప్రతిఒక్కరికీ సకాలంలో సరైన వ్యాధి నిర్ధారణ, సత్వర చికిత్స, నివారణ చర్యలు అందించాలని అన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ద్వారా మాత్రమే ఆరోగ్య హక్కును సాధించగలమన్నారు. కలిసి కట్టుగా శ్రమించి మలేరియాను నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులు ఆరోగ్య శాఖకు సహకరించాలని కోరారు. విద్యాశాఖ, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులను వసతి గృహాల్లో విద్యార్థులు దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది విజయనగరం జిల్లా లో 157 గ్రామాలను మలేరియా అధిక ప్రభావిత గ్రామాలుగా గుర్తించి, 2 విడతల లో పిచికారి నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. మే 15 నుంచి మొదటి విడత పిచికారి మొదలు కాబోతున్నదని , అందుకు గాను గ్రామా స్తాయి లో ఉన్న అన్ని శాఖల సిబ్బంది సహకరించేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను డిఎంహెచ్‌ఒ కోరారు.

సతివాడ పిఎసిఎస్‌ను సందర్శించిన జెసి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లాలో పూర్తి స్థాయిలో కంప్యూటరైజేషన్ జరిగిన నెల్లిమర్ల మండలం సతివాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఎస్-ఎఎస్) కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాదవన్ గురువారం సందర్శించారు. కార్యాలయ సిబ్బందితోనూ, డిసిసిబి జిల్లా అధికారులతోనూ మాట్లాడారు. సొసైటిలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీల గురించి అడిగి తెలుసుకున్నారు. సొసైటీ పరంగా ఆర్థికాభివృద్ధి సాధనకు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. రైతులకు ప్రయోజనకరమైన సేవలు అందించడంతో పాటు ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సిఇఒ సిహెచ్.ఉమామహేశ్వరరావు, డిసిసిబి డిజిఎం ప్రసాద్, సతివాడ పిఎసిఎస్ పర్సన్ ఇంఛార్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల డిసిసిబి బ్రాంచి మేనేజర్ కె.రజని, సూపర్‌వైజర్ వైవిఆర్ మూర్తినాయుడు, పిఎసిఎస్ సిఇఒ సన్యాసప్పుడు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

టెన్త్ విద్యార్థులకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-విజయనగరంకోట

పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన పోలీసు వెల్ఫేర్ స్కూలు విద్యార్థులను ఎస్‌పి వకుల్ జిందాల్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కేక్ కట్ చేసి తినిపించారు. పాఠశాలలో 13మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరుకాగా అందరూ ఫస్ట్‌కాస్‌లో ఉతీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 11మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించడం గొప్ప విషయమని అన్నారు. ఈా జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి, విద్యార్థులకు తినిపించారు. పాఠశాలలో ఇతర కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఇదే రకమైన ఫలితాలను భవిష్యత్తులో కూడా సాధించాలని ఆకాంక్షించారు. 581 మార్కులతో స్కూలు ఫస్ట్ గా నిలిచిన ఎస్. వైష్ణవి, 575 మార్కులతో స్కూలు సెకండ్ గా నిలిచిన సిహెచ్.హర్ష వర్ధన్, 562 మార్కులతో స్కూలు థర్డ్ నిలిచిన జి.లవీంద్రులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారు. హెచ్ ఎం.సంధ్య, ఉపాధ్యాయులు, అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ (ఎఆర్) జి.నాగేశ్వరరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కేకు కట్ చేయిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్



శిక్షణ శిబిరంలో ఎంఇఒ, జెవివి, యుటిఎఫ్ నాయకులు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథమే లక్ష్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక, గ్రీన్‌బెల్ట్ సొసైటీ విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నాయి. బొబ్బిలి పట్టణంలో స్థానిక వాసు జూనియర్ కాలేజీలో గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షులు రమణమూర్తి అధ్యక్షతన గురువారం శిబిరం ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథి ఎంఇఒ వాసుతోపాటు జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పి.సత్యంనాయుడు, గాదెలవలస, పెంట పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శంకరరావు, రమణ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి పాల్గొని మాట్లాడారు. రిసోర్స్ పర్సన్లుగా శంబంగి శ్రీనివాస్, ఆనెం శ్రీనివాస్, ప్రవీణ, ప్రమీల, పి.సత్యనారాయణ, మల్లేశ్వరరావు, శశిభూషణ్, బ్రహ్మాజీ, రమణమూర్తి, స్వామినాయుడు, గౌరునాయుడు, నాగూరు రమేష్, పీతల శ్రీనివాస్ వ్యవహరిస్తారు.

మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి-వేపాడ

సింగరాయి సచివాలయ పరిధిలో మట్టి నమూనాలు సేకరిస్తున్నామని విఎఎ కోమలి ఒక ప్రకటనలో తెలిపారు. మట్టి పరీక్షలు చేయించుకునేందుకు రైతులకు మంచి అవకాశమని చెప్పారు. మట్టి పరీక్షల ఫలితాల ఆధారంగా రైతులు పంటలు సాగుచేసుకోవచ్చని తెలిపారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు హెచ్చరించారు. తెర్లాం మండలం సుందరాడలో గురువారం ఎక్సైజ్ పోలీసులు బెల్ట్‌షాపుపై దాడి చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి వ్యాపారిని అరెస్ట్ చేశారు. 10 మద్యం సీసాలను సీజ్ చేశారు. బెల్ట్ షాపుల నివారణకు సహకరించాలని ప్రజలను కోరారు.

పార్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పార్కుల పరిరక్షణ అందరి బాధ్యతని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. గురువారం స్థానిక 28వ డివిజన్ పిఎస్ఆర్ కాలనీ పార్కు నుంచి ప్రారంభమైన వార్డు పర్యటనలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేటర్ జాకీర్ హుస్సేన్ పలు సమస్యలపై ఆయనకు వినతి అందజేశారు. అనంతరం డివిజన్లో పర్యటించి పలు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపుతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎఇ సీతారామమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. విటి అగ్రహారం, బిసి కాలనీ, ప్రదీప్ నగర్, మజ్జిపేట, రౌంగలివీధి, సంతోష్ నగర్, ప్రియానగర్, దుర్గానగర్, వైజంక్షన్, గాంధీ నగర్ , ఝాన్సీనగర్ , ప్రసాద్ నగర్, పెద్దవీధి , రెడ్డివీధి, బూర్లపేట, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేస్తామని చెప్పారు.

నెలిమర్ల మండలంలో..

నెల్లిమర్ల : సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని చాలని కోరారు.

ప్రయివేట్ లైసెన్స్‌తో భవన నిర్మాణాలకు అనుమతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో ప్రయివేట్ లైసెన్స్‌తో భవన నిర్మాణం అనుమతులు పొందవచ్చని కమిషనర్ ఎ.తారక్‌నాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణం అనుమతి సులభతరంగా పొందడానికి ప్రయివేట్ లైసెన్స్ విధానంపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం భవన నిర్మాణం అనుమతులు ఇవ్వడానికి ప్రయివేట్ వ్యక్తులు సెల్ఫ్ డిక్లరేషన్‌తో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకున్న వారికి భవన నిర్మాణం అనుమతులు పొందడానికి లైసెన్స్ ఇస్తామని చెప్పారు.

నీటితీరువా వసూళ్లకు చర్యలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలో 51 రెవెన్యూ గ్రామాలలో 1,434 ఫసలీకి సంబంధించి రూ.3,05,49,000 బకాయిలు ఉన్నాయని, వాటిని వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నామని నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహశీల్దార్ బలివాడ ఈశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తీరువా బకాయిలు రూ.3.05 కోట్లుకు గాను, ఇప్పటికి రూ.4.95 లక్షలు వసూళ్ళ చేసినట్టు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మిగతావి వసూళ్లు చేస్తామన్నారు. భూ రీ సర్వేలో అంబఖండి గ్రామాన్ని పూర్తి చేసామని, ఇప్పటికే ఎఫ్‌పిఒఎల్‌ఆర్ నడుస్తుందని చెప్పారు. ప్రస్తుతం పోరాం, లక్ష్మీపురం సర్వే జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణా పై నిఘా ఉంచామన్నారు. రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న ముటేషన్లు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

ఉపాధి వేతనదారులకు మందులు పంపిణీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడలో గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదార్లకు వడ దెబ్బ తగలకుండా గురువారం హోమియో మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు ప్రభుత్వ హోమియో ఆసుపత్రి వైద్యులు పి. సుమలత పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి 700 మంది ఉపాధి వేతనదార్లకు వడదెబ్బ తగలకుండా ఈ మందులు పంపిణీ చేశారు. వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ, గ్రామ పెద్దలు చందక త్రినాథ్, కోరాడ శ్రీను, ఆల్తి నల్లిబాబు, రామచంద్ర, ఆశా వర్కర్లు అప్పలనారాయణ, కంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజుపాత్రుని పాలెంలో గ్రామసభ

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీలో రాజపాత్రునిపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి శైలజ ఆధ్వర్యంలో సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. రాజపాత్రునిపాలెం నుంచి కొత్తవలస వెళ్లే ఆర్‌యుబి వద్ద ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరారు. సర్పంచ్ స్పందిస్తూ ఆక్రమణలను తొలగించేందుకు పంచాయతీ సిబ్బంది సిద్ధంగా ఉన్నా, పైవారి ఒత్తిళ్లు తట్టుకోలేక తొలగించలేకపోతున్నామని బదులిచ్చారు. రాజపాత్రునిపాలెంలో ఉపాధి పనులు కేటాయించాలని వైస్ ఎంపిపి కర్రి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రఘురామరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వర్ణలత, టిడిపి నాయకులు లంగా శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వేడుక నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తొలుత మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. గ్రామాలను అభివృద్ధిలో పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కొంతమంది సర్పంచులకు, ఉద్యోగులకు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్ రామన్, విజయనగరం, జియ్యమ్మ వలస జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, మూడడ్ల శశికళ, రేగిడిఆముదాలవలస వైస్‌ఎంపిపి టి.అచ్చిమి నాయుడు, జెడ్‌పి ఉద్యోగులు పాల్గొన్నారు.


ఉత్తమ ఎంపిడిఒగా రామకృష్ణరాజు

స్థానిక ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపిడిఒగా జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

రాజాం: స్థానిక ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఏటా ఏప్రిల్ 24న నిర్వహిస్తామని, స్థానిక పాలనా వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించడంలో పంచాయతీ రాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయిని అన్నారు. గ్రామీణ అభివృద్ధి ప్రోత్సహించడంలో, సామాజిక సాధికారతలో వీటి పాత్రను ప్రజలకు తెలియజేయడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఉప కార్యనిర్వాక ఇంజనీర్, పిఎయు ఉప కార్యనిర్వాక ఇంజనీర్, నాలుగు మండలాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, రూరల్ వాటర్ సప్లై అసిస్టెంట్లు ఇంజనీర్లు పాల్గొన్నారు.

రేగిడి: పంచాయతీరాజ్ చట్టాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు అచ్చెంనాయుడు, జగన్మోహన్‌రావు అన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంలోని 73, 74 ఆర్టికల్ లో పొందుపరిచిన అంశాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్యామల కుమారి, పంచాయతీరాజ్ జెఇ రియాజ్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





బాడంగి ఎంపిడిఒ శంబంగి రామకృష్ణను, డిపిఒ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ రాకోటి తేజను సత్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అధికారులు



వేపాడ : ఓబులయ్యపాలెం, పాటూరు కార్యదర్శులను సత్కరిస్తున్న అధికారులు

నెల్లిమర్ల : గ్రామ ప్రణాళికతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపిపి అంబళ్ల సుధారాణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించి మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలను సాకారం చేయడానికి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, పరిపాలన అధికారి సుదర్శనం, ఎంఇఒలు యు.ఎస్.ఎన్. మూర్తి, ఈపు విజయ్ కుమార్, వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ప్రజా సేవలో పిఆర్ ముందు

వేపాడ : ప్రజా సేవలో పంచాయతీరాజ్ శాఖ ముందుంటుందని ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. వేపాడలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన కార్యదర్శులు ఆర్.కిశోర్ (ఓబులయ్యపాలెం), జి.అనిల్‌కుమార్ (పాటూరు)ను సత్కరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రవికుమార్, ఎపిఒ ఆదిలక్ష్మి, ఎపిఎం సన్యాసిరావు, ఎఇ మహేష్, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

- ఏ పార్టీ నుంచి బి-ఫాం ఇచ్చినా బరిలో దిగుతా
- లేదంటే స్వతంత్ర అభ్యర్థిగానైనా పోటీ చేస్తా
- బొత్స లక్ష్మణరావు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

రానున్న 2029 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటానని వైసిపి నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స లక్ష్మణరావు ప్రకటించారు. తన సామర్థ్యం గుర్తించి తనకు ఏ పార్టీ బి-ఫాం ఇస్తే ఆ పార్టీ నుండే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. తనను కొందరు ఏదో ఒక పార్టీకి సంబంధించిన వ్యక్తి అనుకుంటారన్నారని కానీ తనకు నచ్చిన వారికి ఎన్నికల్లో సపోర్ట్ చేస్తుంటానని అన్నారు. 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పతివాడ నారాయణస్వామినాయుడుకు, 2019లో వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడుకు, 2024లో జనసేన అభ్యర్థి లోకం మాధవికి సపోర్ట్ చేశానన్నారు. తనకు పార్టీలు కాదని, పోటీ చేసిన అభ్యర్థి ముఖ్యమన్నారు. ఇప్పుడైతే తను నమ్ముకొని చాలామంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. వారందరి కోసం 2029లో ఎమ్మెల్యేగా తాను గాని, తన కుమారుడు చైతన్యగాని పోటీలో ఉంటామన్నారు. తనను అభిమానించేవారు పార్టీల కతీతంగా ఉన్నారన్నారు. ముందుగా తన సామర్థ్యం గుర్తించి తనకు అవకాశం ఇస్తే స్వీకరిస్తానన్నారు. విబేధాలతో ఏ పార్టీలోనూ చేరనని, స్థానికంగా ఉండే నేతలు ద్వారా సమన్వయం ఉంటేనే పిలిచే పార్టీలోకి వెళతానని అన్నారు.

అగ్ని బాధితులకు రూ.1.20 లక్షలు సాయం

మండలంలోని పతివాడ పంచాయతీలోని గులివిందల పేటలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను గురువారం బొత్స లక్ష్మణరావుతోపాటు ఆయన కుమారుడు బొత్స చైతన్య పరామర్శించారు. బాధిత కుటుంబాలకు రూ. 1.20 లక్షలు నగదును అందజేశారు. పెండ్లి కోసం దాచుకున్న నగదు కాలిపోయిన కుటుంబానికి రూ.75 వేలు, మిగతా నాలుగు ఇళ్లకు సంబందించి రూ.10 వేలు చొప్పున అందించారు. అక్కడ ఉన్న వికలాంగుడుకు రూ.5 వేలు ఇచ్చారు. బాధిత కుటుంబాలకు బియ్యం బస్తాతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఆయనతోపాటు పతివాడ సర్పంచ్ పైడిరాము, ఉప సర్పంచ్ సూరిబాబు, సంకాబత్తుల సత్తిబాబు, మహంతి శివ, నక్కాన రమణ, ఐటివి శ్రీనువాసరావు, రౌతు వెంకటప్పారావు, మహేష్, రౌతు ఉపేంద్ర, వందనాల అప్పలరాజు, బర్రి నూకరాజుతో పాటు పలువురు టిడిపి, జనసేన, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న బొత్స లక్ష్మణరావు, చైతన్య

రుణ ప్రణాళికలు సిద్ధం చేయండి : ఎల్‌డిఎం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి అన్ని శాఖల సిబ్బంది రుణ ప్రణాళికలను సిద్ధం చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బొబ్బిలి, రామభద్రపురం మండలాల బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు అంతర్గత అప్పులు ఇవ్వాలని సూచించారు. మహిళా లీడ్ ఎంటర్‌పెన్యూర్ పథక లక్ష్యాలను మండలానికి 230 చొప్పున జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు. నాబార్డు ఎజిఎం మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ నుంచి రత్నాకర్, గజపతినగరం వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఆదయ్య, ఎపిఎంలు పి.భాగ్యలక్ష్మి, అన్నపూర్ణ, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డిఎం రమణమూర్తి

మహిళల్లో స్ఫూర్తి నింపేందుకు బాక్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలకు క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తెలిపారు. క్రీడలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం విజ్జి స్టేడియంలో అస్మిత (యాక్షన్ ద్వారా మహిళలకు స్ఫూర్తినివ్వడం) సిటీ బాక్సింగ్ లీగ్‌ను, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా నలు మూలల నుండి సుమారు 100 మంది బాలికలు హాజరయ్యారు. కార్యక్రమమలో డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు,క్రీడాకారులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బడిబాట ర్యాలీ

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో అత్యధికంగా 26 మంది 500కు పైబడి మార్కులు సాధించిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాల బడులలో కల్పిస్తున్న సౌకర్యాలు, తమ పాఠశాలలో ప్రత్యేకతలు, విద్య బోధనపై విస్తృత ప్రచారం చేపట్టారు. ర్యాలీలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కె.మోహన్ రావు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్, పాఠశాల చైర్మన్ లెంక స్వామినాయుడు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చడమే ప్రభుత్వం ధ్యేయం

ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజావసరాలను తీర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. గురువారం స్థానిక విటి అగ్రహారం, బిసి కాలనీ వద్ద వాటర్ ట్యాంకు పైపులైన్ ఇంటర్ కనెక్షన్లు, పైపులైను ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రూ.1.46 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో టిడిపి హయాంలోనే విటి అగ్రహారం బిసి కాలనీ ఏర్పాటైందన్నారు. ఆ తర్వాత ప్రజల అవసరాలను గుర్తించి ఒక్కొక్కటి పరిష్కరించామని చెప్పారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బొబ్బిలి

కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి డి.వర్మ, ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు ఎం.గోపాలం, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సాయికృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్మికుల హక్కులను కాలరాసి యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లు తీసుకువచ్చారని విమర్శించారు. మే 11న బొబ్బిలిలో కార్మిక సంఘాలతో సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సుకు కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొబ్బిలి పట్టణానికి చెందిన పట్నాయకుని శ్రీదేవి (37) మృతి చెందింది. మున్సిపాలిటీలోని మిలిటరీ కాలనీకి చెందిన పట్నాయకుని అనిల్‌కుమార్.. భార్య శ్రీదేవితో కలిసి బైక్‌పై సీతానగరంలోని ఆలయానికి వెళ్తున్నారు. ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమ వద్ద వెనుక నుంచి వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం బైక్‌ను ఢీకొంది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. బొబ్బిలిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి శ్రీదేవి మార్గం మధ్యలో మరణించింది. అనిల్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి- మెరకముడిదాం

అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం తెలుసుకున్న బుధరాయవలస ఎస్ఐ జె.లోకేష్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఎం.రావివలస గ్రామానికి చెందిన ఊన కిరణ్ కుమార్‌పై దాడి చేసి ఆరు ఆఫ్ బాటిళ్లు, నాలుగు బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

మృతుని ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - భోగాపురం

చెరువులో పడి మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గురువారం లభ్యమైంది. మండలంలోని రామచంద్రపేట గ్రామానికి చెందిన రాజోడు (65)గా పోలీసులు గుర్తించారు. భోగాపురంలోని ముక్కాం వెళ్లే కూడలి వద్దనున్న గంగరాల చెరువులో బుధవారం మధ్యాహ్నం మృతదేహం లభించిన విషయం తెలిసిందే. దీనిపై మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.